క్లుప్తంగా

'బడిబాట' ప్రారంభం



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి పాఠశాల హెచ్‌ఎం అనంతుల జ్యోతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు కొత్త కాలనీలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు తాము ఈ బడిబాట కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులు, సదుపాయాలు, ట్రావెలింగ్ అలవెన్సులు లాంటి వాటిని తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



సమావేశంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలలో ముందుండాలని అలయన్స్ క్లబ్ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా అలయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ సోమశివకుమార్ ఆధ్వర్యంలో పార్వతిదేవి ఆలయంలో గురువారం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. నూతన కార్యవర్గ సభ్యులకు సేవా కార్యక్రమాలపై దిశనిర్దేశం చేశారు. వైశ్యభవన్‌లో శనివారం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వర్ చరణ్, సతీశ్ కుమార్, అంజయ్య, వైకుంఠం, ఆత్మ రాములు, శివ కుమార్, వనజ, బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీపూర్ ప్రాథమిక పాఠశాలలో అక్కి అనిత సంతోష్ కుమార్ దంపతుల సహకారంతో గురువారం విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, కంపాక్స్ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సీతారాములు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. విద్యార్థులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ దుకాణాలకు వేలం

హుస్నాబాద్: రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద గురువారం ఆలయానికి సంబంధించిన పలు దుకాణాలకు వేలం నిర్వహించారు. ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో ఈ వేలం నిర్వహించారు. పూజాద్రవ్యాలు, టెంకాయలు అమ్ముకోడానికి రూ.3.23 లక్షలు, అలాగే చీరలు, కనుములు ప్రోగుచేసుకొని విక్రయించడానికి రూ.3.18 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అలాగే జాతర తర్వాత 10 నెలల కోసం కొబ్బరికాయలు, దుస్తులు పోగుచేసుకొని అమ్మడానికి రూ.3.56 లక్షలు, మిశ్రమ బియ్యం పోగు చేసుకొనడానికి రూ.1.92 లక్షలు, అదేవిధంగా పచ్చికొబ్బరి ముక్కల సేకరణకు రూ.1లక్షతో దక్కించుకున్నారు. అలాగే పారిశుద్ధ్యం రూ.40వేలు, ఎలక్ట్రికల్, డెకరేషన్ రూ.69 వేలు, కేటరింగ్ రూ.80వేలు, తడకల పందిళ్లు రూ.30 వేలకు దక్కించుకున్నారు. లడ్డు, పులిహోర ప్రసాదం వేలానికి పాటదారులు రాకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఈఓ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

దుబ్బాక: పట్టణంలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ గురువారం ప్రారంభించారు. మండుటెండల్లో పేదప్రజల దాహార్తిని తీర్చేందుకు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై సీఐటీయూ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో గోపాలస్వామి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

వీడనున్న గ్రహణం

- మండల పరిషత్ భవనానికి నిధులు
- రూ.1.50కోట్లతో నిర్మాణానికి ఉత్తర్వులు
- మంత్రి పొన్నం ప్రత్యేక చొరవ
- తీరనున్న ఇబ్బందులు

మండల పరిషత్ భవనంలేక ప్రజలు, అధికారులు ఎన్నో యేళ్లుగా పడుతున్న ఇబ్బందులు త్వరలో తీరనున్నాయి. నూతన భవన నిర్మాణానికి ఇటీవల రాష్ట్ర పంచాయితీ రాజ్‌శాఖ రూ.1.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వేగంగా నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంగా 2016లో ఏర్పాటైంది. అప్పటి నుంచి దాదాపు ఎనిమిదేళ్లు దాటుతున్నా ఎంపీడీఓ కార్యాలయంలో సరైన సౌకర్యాలు, సదుపాయాలు లేవు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదుల్లోనే ఎంపీడీఓ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. మూడు నెలకొసారి నిర్వహించే జనరల్ బాడీ నిర్వహించాలంటే సరైన సదుపాయాలు, కూర్చొనేందుకు స్థలం లేక అధికారులు నానాఅవస్థ పడుతున్నారు. వానకాలంలో చిన్నపాటి వర్షం పడితే చాలు కార్యాలయంలో నీరు చేరడం మామూలైంది. ఏదైనా సమీక్ష సమావేశం నిర్వహించాలంటే కార్యాలయంలో విశాలమైన స్థలం లేక మమ అనిపిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో భవన నిర్మాణానికి పలుమార్లు ప్రత్నించినా నిధులు మంజూరుకాలేదు.

మంత్రి పొన్నం చొరవతో..

అక్కన్నపేట మండలంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపారు. ఎన్నో యేళ్లుగా భవనం లేక అవస్థలు పడుతున్న విషయాన్ని గుర్తించి నిధుల మంజూరు కోసం కృషిచేశారు. అయితే మండల కేంద్రంలో సర్వే నంబరు 387లో దాదాపు ఐదెకరాల్లో సమీకృత భవనాల నిర్మాణానికి గతంలోనే స్థలాన్ని సేకరించారు. వెంటనే మండల పరిషత్ భవన నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు, అధికారులు కోరుతున్నారు. ఆ దశగా అడుగులు వేస్తే గత ఎనిమిదేళ్లుగా పడుతున్న కష్టాలు, అసౌకర్యాల బాధ తీరుతుందని ఎదురుచూస్తున్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు వచ్చేలోపే భవన నిర్మాణం పూర్తవుతుందా? అనేది వేచి చూడాలి.

> **త్వరగా నిర్మాణ పనులు చేపట్టాలి**
>
> 
>
> మండల పరిషత్ భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలి. ఎనిమిదేళ్లుగా అసౌకర్యాల నడుమ పాలనను నెట్టుకొస్తున్నారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడం సంతోషకరం. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టిసారించి స్థానిక ఎన్నికలు రాకముందే భవన నిర్మాణ పనులు పూర్తి చేయించాలి.
>
> – గొల్లపెల్లి వీరాచారి, కిసాన్ మోర్చా రాష్ట్ర నేత

రసాయన ఎరువుల వాడకం తగ్గించండి

- రైతులకు డ్రమ్ములు పంపిణీ
- ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలశౌరి



రైతులతో మాట్లాడుతున్న బాలశౌరి

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని లోడి సాంఘిక సేవా సంస్థల ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలశౌరి సూచించారు. మండలంలోని కుందనవానిపల్లిలో గురువారం మానోస్ యూనిదాస్ వారి సహకారంతో సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు అవసరమైన డ్రమ్ములను రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రమ్ములో రైతులు ఆవు మూత్రం పట్టి దానిలో ఆవుపేడ, పుట్టమట్టి, శనిగపిండి, బెల్లం కలిపి దానిని ఆపశయన దశలో తిప్పుతూ వారం రోజుల తర్వాత పంటలకు పిచికారి చేసినట్టయితే భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సత్యనారాయణ, కనకం, రవీందర్, బిచ్చ, తిరుమల, రమేశ్, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ నేతల ఆధ్వర్యంలో నిరసనలు

- జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్



చేర్యాల(సిద్దిపేట): నిరసన తెలుపుతున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని నిరసిస్తూ గురువారం సీపీఐ నేతలు పట్టణంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ ఆధ్వర్యంలో సిద్దిపేట జనగామ ప్రధాన రహదారిపై గ్యాస్ సిలిండర్‌తో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన 11 యేళ్లలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారన్నారు. ఇప్పటికైనా ధరలు అదుపు చేయకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

నీటిలో నిలబడి నిరసన

బుధవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికే స్థానిక అంగడి బజార్ చౌరస్తాలో చెరువును తలపిస్తుండటంతో సీపీఐ నాయకులు ఆ వర్షపు నీటిలో నిలబడి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ అంగడి బజారు చౌరస్తా వద్ద గుంతల్లో వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తుందన్నారు. దీంతో ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొందని, మున్సిపల్ అధికారులు, కలెక్టర్ స్పందించి సీసీరోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూమయ్య, బాలుమోహన్, యాదగిరి, మమత, నర్సింహాచారి, సుదర్శన్, పార్థు, సురేందర్, అంజయ్య, సత్తయ్య, రాజు, నర్సయ్య, జహులమద్దిన్, ఇస్తారి, కనకవ్వ, రాజవ్వ, మల్లవ్వ, లచ్చవ్వ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు పోరాటం చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): రాజ్యాంగ రక్షణ కోసం పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. బెజ్జంకిలో సీపీఐ ఆధ్వర్యంలో బీజేపీ పాలనకు వ్యతిరేకంగా గురువారం ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు సవరణలోను ప్రతిపక్షాలను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో రూపేష్, మధు, మహేశ్, శ్రావణ్, లక్ష్మణ్, బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

మిరుదొడ్డి(దుబ్బాక): పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి లింగంపేట ఎల్లయ్య డిమాండ్ చేశారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్‌తో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పెంటయ్య, ఎల్లం, శ్రీనివాస్, స్వామి, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కానిస్టేబుళ్ల కుటుంబాలకు చెక్కులు

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు చెక్కులను అందజేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుళ్లు పరందాములు, వెంకటేశ్ కుటుంబాలకు డిపార్ట్‌మెంట్ భద్రత నుంచి వచ్చిన రూ.16 లక్షల చెక్కును ఆమె గురువారం అందజేశారు. అదేవిధంగా ఎడ్యుకేషన్ మెరిట్ ఎగ్జామ్‌లో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని ఆధ్యను అభినందించారు.

◆ నేడు చేయూత పింఛన్లపై అవగాహన

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం అందించే చేయూత పింఛన్లపై శుక్రవారం శుభం గార్డెన్‌లో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్ మండలాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొంటారని చెప్పారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ హాజరవుతారని తెలిపారు.

◆ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

దుబ్బాకటౌన్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షబానా ఆదేశించారు. రాయపోల్ మండలం రామారం అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్లు పున్నమ్మ, సరస్వతి, ఆయా రేణుక, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సహాయం అందజేత

హుస్నాబాద్‌రూరల్: గాంధీనగర్‌కు చెందిన శివరాత్రి కనకయ్య ఇటీవల మరణించడంతో ఆ కుటుంబ సభ్యులకు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందించారు. కమిటీకి చెందిన రూ.9,500లు, పురుషుల పొదుపు సంఘం నుంచి రూ.2,500లు అందజేశారు.

◆ వైద్యంపై నమ్మకం కల్పించండి

సిద్దిపేటజోన్: సర్కార్ వైద్యంపై ప్రజలకు నమ్మకం కల్పించాలని రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు సాయిరాం అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఆసుపత్రిలో హరీశ్‌రావు ఒకప్పుడు మెరుగైన వైద్యం అందేలా చూశారని, ప్రస్తుత ప్రభుత్వం ఆసుపత్రుల్లో వసతులు, మందుల కొరత తీర్చడంలో వైఫల్యం చెందిందని ఆరోపించారు. కౌన్సిలర్లు సుందర్, మోహిజ్, మణి, నాగరాజు, షాహిద్ పాల్గొన్నారు.

◆ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించండి

గజ్వేల్‌రూరల్: ఉపాధి హామీ కూలీలకు ఎండ నుంచి ఉపశమనం పొందడానికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి ఆదేశించారు. మడలంలోని కొమటిబండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు.

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో ఒక్కరికి జైలు

కొమురవెల్లి(సిద్దిపేట): ఎస్‌ఐ రాజు తమ సిబ్బందితో కలసి సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురు పట్టుపడ్డారు. వారిని గురువారం చేర్యాల కోర్టులో హాజరుపర్చగా విచారణ చేపట్టిన న్యాయమూర్తి కృష్ణతేజ ఒకరికి ఏడు రోజుల జైలు శిక్ష, మిగతా ముగ్గురికి రూ.16వేలు జరిమానా విధించినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్ తెలిపారు.

◆ చెక్కులు అందించాలని నిరసన

గజ్వేల్‌రూరల్(గజ్వేల్): కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని, లేకపోతే కేసీఆర్ ఫాంహౌస్‌ను ముట్టడిస్తామని బీజేపీ మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ హెచ్చరించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఐదుగురు పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.8 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ మైత్రివనం ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైత్రివనం, కాకతీయనగర్, రాజేంద్రనగర్, బీజేఆర్ చౌరస్తా, మహాశక్తి నగర్, ఆదర్శనగర్, విఘ్నేశ్వరనగర్, వినాయకనగర్ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 7.30 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సేవచేసేందుకే పదవులు

సిద్దిపేటజోన్: పదవులు అలంకారం కాదని, అది ప్రజలకు సేవచేసే భాగ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి అన్నారు. స్థానిక మొకిడి నర్సింహారెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన జిల్లా ఆర్టీఏ సభ్యుడు డాక్టర్ సూర్యవర్మ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కష్టపడే కార్యకర్తలకు అవకాశాలు వస్తాయన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో సూర్యవర్మ ఆర్టీఏ సభ్యుడిగా నియామకమయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభాకర్ వర్మ, జి.శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు

దుబ్బాకరూరల్: రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోకూడదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. అక్బర్‌పేటభూంపల్లి మండలం చిట్టాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సివిల్ సప్లయ్ అధికారి ప్రవీణ్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

వర్గల్(గజ్వేల్): ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర పొందవచ్చని పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, సీఈఓ జితేందర్‌రెడ్డి అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో వర్గల్‌తో పాటు తున్కిఖాల్సా, అంబర్‌పేట, వేలూరు, నాచారం, మజీద్‌పల్లి, నెంటూరు, మైలారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు.

ప్రజల రక్షణ కోసమే..

సిద్దిపేటరూరల్: ప్రజలను రక్షించడం కోసమే తాము పనిచేస్తున్నామనే విషయాన్ని తెలిపేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు రూరల్‌సీఐ శ్రీను తెలిపారు. నారాయణరావుపేటలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంతో పాటు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో జాగిలాలతో తనిఖీ నిర్వహించారు. ధ్రువపత్రాలులేని 55 బైకులతోపాటు ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అపూర్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13న జర్నలిస్టుల సమ్మేళనం

చేర్యాల(సిద్దిపేట)/దుబ్బాకటౌన్: తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ ఆధ్వర్యంలో 13న హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్న జర్నలిస్టుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ బైరాగి పిలుపునిచ్చారు. పట్టణకేంద్రంలో గురువారం సమ్మేళనానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, ఆనంద్‌రావు, యాదగిరి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కడగళ్లు మిగిల్చిన వడగళ్లు



వెల్కటూరులో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

మద్దూరు(హుస్నాబాద్): రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో అకాలంగా కురిసిన వడగండ్ల వర్షానికి పంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నర్సయపల్లిలో గురువారం తెల్లవారుజామున వడగండ్ల వర్షం కురిసింది. వడగండ్ల వర్షానికి వరి పంట నేలపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో సుమారు వంద ఎకరాల పైగా వరి పంట నష్టం జరిగింది. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వెల్కటూరులో 15ఎకరాలలో..

సిద్దిపేటఅర్బన్: వడగండ్ల వాన ప్రభావంతో మండలంలోని వెల్కటూరులో దెబ్బతిన్న వరి పొలాలను అర్బన్ మండల ఏఓ బి.శ్రీనాథ్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నష్ట తీవ్రతకు సంబంధించిన ప్రాథమిక నివేదికను పై అధికారులకు సమర్పించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. గ్రామంలో సుమారు 15 ఎకరాలలో పంట దెబ్బతిన్నట్టు గుర్తించినట్టు తెలిపారు. నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని రైతులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేశ్‌యాదవ్ ఉన్నారు.

మూడు గ్రామాల్లో 185 ఎకరాలు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని దానంపల్లి, కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాల్లో దెబ్బతిన్న వరిపొలాలను మండల వ్యవసాయాధికారి బోగేశ్వర్ పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు గ్రామాల్లో మొత్తం 185 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. దానంపల్లి 165 ఎకరాలు, అర్జునపట్ల 5 ఎకరాలు, కమలాయపల్లి 15 ఎకరాల్లో పంట పరిశీలించామన్నారు.

మార్కుల విధానం వద్దు.. జీపీఏనే ముద్దు

- జీస్మాట్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి



వినతిపత్రం అందిస్తున్న జీస్మాట్ ప్రతినిధులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదోతరగతి పరీక్షల ఫలితాలను గతంలో లాగా జీపీఏ విధానాన్నే కొనసాగించాలని జీస్మాట్ రాష్ట్ర కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పదోతరగతి విద్యార్థులకు జీపీఏ పద్ధతి ద్వారా బోధన జరిగిందన్నారు. కానీ ప్రభుత్వం విద్యా సంవత్సరం చివరలో జీపీఏ పద్ధతి రద్దుచేసి మార్కుల విధానంలో ఫలితాలను ఇస్తామని జీఓ జారీ చేయడం సరి కాదని వాపోయారు. మార్కుల విధానం వల్ల కార్పొరేట్ పాఠశాలలకు లాభం చేకూరుతుందని, అందువల్ల పాత జీపీఏ విధానంలోనే ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు సంపత్ కుమార్, భగవాన్ రెడ్డి, బాలకృష్ణ, సికిందర్, షేక్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం



మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొగుట(దుబ్బాక): రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి అనంతుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట, పెద్ద మాసాన్‌పల్లి, బండారుపల్లి గ్రామాల్లో గురువారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. ప్రజల హక్కులను కాలరాసే మనుధర్మ శాస్త్రాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తోందని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అక్కం స్వామి, బాల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, పోచయ్య, నరేందర్‌రెడ్డి, రవీందర్, నర్సింహులుగౌడ్, భూపాల్‌రెడ్డి, బుచ్చయ్య, నర్సవ్వ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

హస్తం పేదల నేస్తం

జగదేవ్‌పూర్(గజ్వేల్): హస్తం పేదల నేస్తమని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. జై బాపు.. జై భీమ్..జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అనంతసాగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం కట్టుబడి పనిచేస్తుందన్నారు. నాయకులు రవీందర్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

మల్లుపల్లి, చెప్యాలలో..

మిరుదొడ్డి(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ నినాదంతో జరుగుతున్న పాదయాత్ర గురువారం మండల పరిధిలోని మల్లుపల్లి, చెప్యాలలో కొనసాగింది. చెప్యాలలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటు పడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భూపాల్‌గౌడ్, కిష్టయ్య, ప్రశాంత్, మహేందర్, మహేశ్, రత్నాకర్‌రెడ్డి. నాగరాజు, జహంగీర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన నేరండ్ల రాజుకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు.

కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని లద్నూర్‌లో చేపట్టిన పాదయాత్ర కార్యక్రమంలో వేదిక పైకి నాయకులను ఆహ్వానించే విషయంలో ఘర్షణ పడ్డారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాగుల శ్రీనివాస్‌రెడిని ఆహ్వానించక పోవడంతో పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశంను ప్రశ్నించారు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

సిద్దిపేటజోన్: అందరం కలిసి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ పిలుపునిచ్చారు. 31, 32, 43వ వార్డుల్లో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఆయన మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు అత్తు, కౌన్సిలర్ పూర్ణిమ, నాయకులు వహిద్ ఖాన్, యాదగిరి, మహేందర్, లక్ష్మి, ఆంజత్, వహబ్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పల్లా



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో జనగామ–సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గాంధీ చౌరస్తా వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను గురువారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పనుల్లో జాప్యం తగదని, వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కడవేర్గు, నాగపురి గ్రామాలకు వెళ్లే దారిలో నెలకొన్న సమస్యతో పాటు స్థానిక కుడిచెరువుకు వెళ్లే మార్గాలకు కూడా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. 45 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో కడవేర్గు దారిలోని జనావాసాలకు తాగునీరు రావడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్థానిక మున్సిపల్ కమిషనర్ నాగేందర్‌తో మాట్లాడి తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు.

చిరుధాన్యాలతోనే పౌష్టికాహారం

- ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి

కొండపాక(గజ్వేల్): చిరుధాన్యాలతోనే పౌష్టికాహారం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. కుకునూరుపల్లిలో గురువారం పోషణ పక్ష్యంలో భాగంగా చిరుధాన్యాల ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీసుకునే ఆహారంలో ప్రొటీన్లు లేకపోవడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా చేతి పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని దుబ్బాక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక సూచించారు. మిరుదొడ్డితో పాటు, అందె, అల్వాల గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. చేతి పరిశుభ్రతపై తల్లులు, బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కలిగించారు. ప్రేమలత, పున్నమ్మ, రేణుక, రేణమ్మ, బుజ్జమ్మ, జమున, రమ, విజయలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సింగాటం గ్రామంలో..

గజ్వేల్‌రూరల్: పోషణ పాక్వాడలో భాగంగా సింగాటం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీడీపీఓ సరిత పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు రెండేళ్ల వరకు పౌష్టికాహారం అందించాలని, ఆరు నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. కిరణ్, సూపర్‌వైజర్ భవాని, వైద్యాధికారి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.